# పిల్లి

ఈర్రాజు దుంగమీద మాంసం కొట్టి అమ్ముతున్నాడన్న మాటే గానీ అతని మనసు మనసులో లేకుండా పోయింది.

కిలో అడిగినోళ్ళకి అరకిలో, అరకిలో అడిగినోళ్ళకి రెండు కిలోల రాయి వేసి తూకం తూసి పక్కనున్నోళ్ళు గుర్తు చేస్తే నాలుక కొరుక్కుంటున్నాడు తప్పైపోయిందని. "ఏటిమావా పొద్దుటేల్నించి నీ వరస ఏం బాగోలేదు, ఏటైందేటి?" అడిగేడు పక్క దుకాణం మావుళ్లు బేరం కొంత సద్దుమణిగేక.

ఆ ఇలాకా అంతా మాంసం అమ్మకానికి మేదర్లే గుత్తకుచ్చుకున్నారు. పొరుగూళ్ళకెళ్లి గొర్రెల్ని,మేకల్ని కొనుక్కు రావటం, మసీదు ఇమాం సాయిబు చేత జపా (సఫా) చెయ్యించడం, మాంసాన్ని అమ్మడం తరతరాల్నుంచి కులవృత్తిగా వస్తా ఉంది. తూర్పు తెల్లబడిన కాణ్నుంచి పిల్లా మేకా అందరూ అదే పనిమీదుంటారు. ఆ పైన మిగులూ తగులూ ఏమైనా ఉంటే సెంటర్లో హోటళ్ళకి అయినకాడికి అమ్మేసి ఇంటికి చేరుకుంటారు.

ఆ టైంకి ఆడోళ్లు వంటలు పూర్తి చేసేసి వెదురుగెడలు, పట్టా కత్తులు ముందేసుకుని వెదురు పేళ్ళ అల్లకం పనికి సిద్ధంగా ఉంటారు. ఇళ్ళకొచ్చిన మొగోళ్లు మొకాలు చేతులు కడుక్కుని వొర్రొర్రగా వొండింది అన్నాల్లో కలుపుకుని తినొచ్చి వెదురుపేళ్ళ తీతలో కూర్చుంటే మళ్ళీ పొద్దు పడమటికి వాలినప్పుడే అక్కణ్నుంచి లేవటం.

పక్కనున్న బీడీ కట్టలోంచి ఓ బీడీ తీసి వెలిగించి ముక్కు నిండా పొగపీల్చి వదిలేడు ఈర్రాజు. ఏవీ లేదన్నట్టు తల అడ్డంగా ఆడించేడు.

"నీకిట్టం లేపోతే సెప్పొద్దులే, ఏటో ఉందని తెలుత్తానే ఉంటేనా" అని; వెనకనించి' అయ్యా అద్దురూపాయియ్యి ఏవన్నా కొనుక్కుంతాను' అని లాగుతున్న కుర్రోణ్ని"ఎల్లెహె ఎదవా" అని కసురుకున్నాడు మావుళ్ళు. "కాలిరుసుకుని ఊళ్లోకొచ్చిన

కాణ్నుంచి ‘కుడిబుజం కిందున్నా ఇస్వాసం లేదెదవకి” అని సణుక్కుని అటు తిరిగిపోయేడు.

రేకుల షెల్టరు లోంచి ఎండ తిన్నగా మొకాల మీద పడి చుర్రుమని కాలతా ఉంది.

బజారుకి తిన్నగా చూపానినంత మేరకి చూసి ఇంక వచ్చేవాళ్లెవరూ కనపడక“ఇయాళ లేసి ఎవడి మొకం జూసేనో, కొట్టిన జీవం సకం కూడా సొమ్మవలేదు” అంటూ మిగిలిపోయిన మాంసం, తలకాయ, కాళ్లు అన్నీ సంచిలో సర్దుకుని లేచేడు మావుళ్లు.

ఈర్రాజుకేసి కొరకొరా ఓ చూపు చూసి‘రారా’ అని కుర్రోణ్ని సైకిలెక్కించుకుని వెళ్లిపోయేడు. ఇదంతా ఏమీ తలకెక్కని పరధ్యానంలో ఉన్నాడు ఈర్రాజు.

మజ్జానం తిండి తిన్నాక ఎప్పట్లాగే ఇంటి ముందున్న గంగ రావి చెట్టు కింద కుడికాలు పొడుగ్గా చాపుకొని, మడిచిన ఎడం కాలి మీద కుదుమట్టంగా కూచుని పట్టా కత్తితో వెదురు పేళ్లు చీలుస్తున్నాడు ఈర్రాజు. అలవాటు ప్రకారం చెయ్యి పని చేసుకు పోతున్నా అతని మనసెక్కడో ఆలోచిస్తా ఉంది.

అతని వరస గమనించి గమనించి ఈర్రాజు పెళ్లాం మంగ “ఏటా పరద్దేనం, చెయ్యి సీరుకుపోగల్దు జేగర్త” అని ఒకసారి, “పేళ్లు మందంగా వచ్చేత్తన్నాయి మావా, సూసుకుని సీల్చు” అని మరోసారి హెచ్చరించింది.

సాయంత్రం అయిదుగంటల వేళప్పుడు పని పక్కన పెట్టి లేచి, సన్నికల్లు మీద కారం, మసాలా ముద్దనూరి మధ్యాహ్నం ఈర్రాజు సంచితో తెచ్చిన మిగులు మాంసం దుమ్ములకి పట్టించింది. పేడు ముక్కల్తో పొయ్యి అంటించి కూర వండింది. కూర ఉడికే లోగా తవ్వెడు బియ్యం చేటలో పోసుకుని ఏరి, కడిగి పెట్టుకుంది. కూరదించి, ఎసరు పొయ్యిమీదికెక్కించి వాకిట్లో పేళ్లు, బుట్టలు, పీటలు అన్నిటినీ చూరుకింద సర్దిపెట్టింది.

ఈర్రాజు కాలుని జాగ్రత్తగా దగ్గరకి మడుచుకుని కొయ్యకాలుని ఊడదీసి పక్కనే ఉన్న నులక మంచానికి చేరబెట్టేడు. చేతుల్ని మంచం పట్టి మీద ఆనించి

బలంగా శరీరాన్ని లేపి మంచం మీదకి చేర్చేడు. వెనక్కి వాలి, తల పట్టిమీదికొచ్చేలా జరిగి, రెండు చేతులూ తల కింద పెట్టుకుని వెల్లకిలా పడుకున్నాడు. చుట్టు పక్కల ఉన్న ఆరేడు గుడిసెల ముందు అంటించిన పొయ్యిల మీద ఉడుకుతున్న రేషను బియ్యం ముక్క వాసన ముక్కుపుటాల్ని తాకుతా ఉంది.

అన్నం దించి నీళ్ల కుండ పొయ్యి మీదికెక్కించింది మంగ. ముసురుకోబోతున్న చీకట్ల మధ్యనుంచి పైనున్న ఆకాశం ముక్క దిగులుగా కన్పించింది ఈఁరాజుకి.

నీళ్ళు గోరువెచ్చగా కాగేక పొయ్యి కింది పుల్లలు బైటికి లాగి నీళ్లు జల్లింది మంగ. పొయ్యికీ మంచానికీ మధ్యలో ముక్కాలి పీటేసింది. రోజూ "నీళ్లు కాగేయా నీళ్లు కాగేయా" అని పది సార్లడిగే ఈఁరాజు ఈ రోజు నోట్లో ముద్దెట్టుకున్నట్టు ఉండిపోవడం మంగకి చిత్రంగా ఉంది.

ఏ పని చేస్తన్నా ఏదో ఒకటి మాట్లాడతా అందర్నీ నవ్విస్తా ఉండే ఈఁరాజు ఈవేళ ఇలాగెందుకున్నాడో అంతుపట్టక కాలు కాలిన పిల్లిలాగ గుమ్మం లోకి వాకిట్లోకి తిరుగుతా ఉంది మంగ. అతను ఒంటికి నీళ్లోసుకుని, ఏడేడిగా ఒక ముద్ద తిని నడుం వాలిస్తే, ఈది చివరి సావుకారిగారింట్లో టీవీ సీరియలు చూసి రావచ్చుని మంగ తొందర.

"మావా, లేసి నీళ్లోసుకో" అంది ఇంక ఆగలేక.

ఈఁరాజు మంగకేసి విసుగ్గా చూడబోయి మానుకున్నాడు. మెల్లిగా కాలు కిందకేసి, రెండోకాలు కూడగట్టుకుని మంచంమీంచి ముక్కాలిపీట మీదికి జరిగేడు. మంగ చెంబు తెచ్చి కుండలోంచి నీళ్లు ముంచి అతని ఒంటి మీద పోసింది. అతను ఒళ్లు రుద్దుకుంటుంటే తను వీపు తోమింది. స్నానం పూర్తయ్యేక పొడి పంచె అందించింది.

అన్నం వార్పు తీసి పళ్లెంలోకి వంచబోతుంటే "ఇయాళ ఆకలిగా లేదే, నువ్వు టీవీ చూసొచ్చేక తింటాన్లే" అన్నాడు ఈఁరాజు మంచం మీద వాలుతూ.

'రోజూ ఈవేళకి వాకిట్లో నులక మంచం మీద కూర్చుని వేడివేడి అన్నాన్ని

అవురావురుమని తినే ఈ మనిషికి ఇవేళ ఏటైెందమ్మా' అనుకుంది మంగ అతన్ని తదేకంగా చూస్తూ. అన్నం, కూర గదిలో పెట్టి తలుపేసి, పక్కింటి దుర్గని, ఎనకింటి నూకాల్ని పిలవటానికెళ్లింది మంగ.

పున్నమి చందమామ గుడిసె వెనక నించి పైకొచ్చింది. వాకిట్లోని గంగరావి చెట్టుకి విరిసిన పూలు వెన్నెల్లో వెన్నముద్దల్లా కన్పిస్తున్నాయి.

పొద్దుట్నుంచి మనసు మనసులో లేకుండా పోయింది ఈర్రాజుకి.

పొద్దున్న జంగయ్య సైకిలు వెనక, చెక్క కేరేజి మీద కూచుని మాంసం దుకాణానికి ఎల్తున్నాడు తను. ఈదరుగు మీద ఎదురు చూస్తా కూచున్న పంతులుగారు "ఈర్రాజూ-మాట" అని కేకెట్టేడు. సైకిలు తొక్కుతున్న జోగయ్య ఆగిపోయేడు.

"నీతో కొంచెం మాట్టాడాలిరా" అన్నాడాయన.

"సెప్పండయ్ గారూ" అన్నాడు తను.

"పని మీద వెళ్తున్నట్టున్నావు" అని నసిగేడాయన.

"పర్లేదు సెప్పండి"

"అదే...అప్పట్లో నువ్వు నీ పట్టాభూమి అమ్మేవు కదా, పట్టా ఇచ్చేవు కానీ మనం రిజిస్ట్రేషను చేసుకోలేదు. ఇప్పుడా అవసరం వచ్చిందిరా. రిజిస్ట్రేషను లేని భూములు చెల్లవంటోంది ప్రభుత్వం. ఏర్పాట్లన్నీ నేను చేసుకుని నీకు చెప్తాను. నువ్వు రిజిస్ట్రాఫీసుకొచ్చి సంతకం పెట్టి వెళ్తే చాలు"

"అలాగేనండి, తవరెలాగంటే అలాగే" అన్నాడు తను.

దార్లో జోగయ్య విషయం అంతా విని "సంతకం పెట్టకొరే" అన్నాడు.

"ఛ. ఊరుకోరా, మాపిల్ల పెళ్లికి దేవుల్లాగ ఆదుకున్నాడు పంతులుగారు. ఆయేళ ఆయనగారు పదేనేలిచ్చి సాయం జెయ్యాపోతే పిల్ల పెళ్లి ఆగిపోయాది తెల్సా! మాయప్ప ఎంత గొడవెట్టింది లగ్గం కాడ డబ్బిచ్చితీరాలని."

"అదప్పుడు మాట, ఇయాళ ఆ బూమి ఇలవెంతో తెల్సా?"

"ఎంత?"

"ఎకరం అయిదు లచ్చలంట"

"ఏటీ, ఆ పోరంబోకు బూమే" అని పగలబడి నవ్వేడు తను.

"అందులో ఏవన్నా బంగారం గనుందని తెల్సిందేట్రా?"

"ఆ...బంగారవేమూలకి, అంతకన్నా ఎక్కువే, దాన్నేటో అంటారొరే, ఎంత తవ్వినా వత్తానే ఉంటాదంట సుద్దరాయ. సుట్టుపక్కల సిరామిక్సు పేక్టరీలన్నింటికీ అది సాలా అవసరవంట. అందుకే ఆ బూమి ఇలవ అలాగ పెరిగిపోయిందంట"

"ఎవడ్రా నీకు సెప్పినోడు?"

"ఏటి నీకు తెల్దేటి, ఊరు ఊరంతా కోడై కూస్తంటేను" మనసులో ముల్లు గుచ్చినట్టైంది ఈర్రాజుకి. ఓరిబాబోయ్, పదిహేను వేలెక్కడ? లక్షల డబ్బెక్కడ!

అందుకే పొద్దుట్నుంచి మతిమతిలో లేకుండా పోయింది.

న్యాయం- అన్యాయం అనే భావాల మధ్య స్థిమితం లేకుండా కొట్టుకుంటన్నట్టుంది. ఏం చెయ్యాలో పాలు పోకండా ఉంది.

ఎప్పట్లాగే మనసు నెమ్మళించటం కోసం మంచుతో నిండిన హిమాలయ పర్వతాల్ని కళ్లల్లోకి తెచ్చుకోవాలని ప్రయత్నించేడు.

ఉహు-సాధ్యం కావటం లేదు.

ఏం బతుకులియ్యి, గొర్రితోక బతుకులు.

ఈ బతుకునించి తప్పించుకోవాలనే ఇరవయ్యేళ్లవయసప్పుడు ఇంట్లో చెప్పకుండా ఎళ్లిపోయి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్లవుతుంటే అందులో జాయినైపోయేడు. ట్రెయినింగు పీరియడ్లో కష్టమనిపించినా పళ్లబిగువున ఓర్చుకుని జవానుగా నిలబడ్డాడు.

మూడేళ్ల తర్వాత ఆర్మీ డ్రెస్సులో ఇంటికొచ్చినప్పుడు గూడెం గూడెమంతా తమ గుడిసె ముందు గుమిగూడేరు.

తల్లి తనని పట్టుకుని ఏడుపుతో మొదలుపెట్టిన రాగం ఆనందంగా ముగించింది.

తనతో పెరిగిన స్నేహితులు "ఏం పెడతన్నార్రా అక్కడ, బలేగా జమానై సీంపందిలాగ నునుపు తేలిపోయేవొరే" అంటుంటే తల్లి ఆళ్లని కసురుకుని దిష్టితీసి పొయ్యడం తనకింకా గుర్తే.

మరోసారి సెలవమీదొచ్చినప్పుడు మేనమావ కూతురు మంగతో పెళ్లి, ఆ తర్వాత ఇద్దరు పిల్లలు పుట్టుకు రావటం అంతా కలలాగ ఉంటాది.

బోర్డర్లో డ్యూటీ కావడాన్న మంగనీ పిల్లల్నీ ఎప్పుడూ తనతో ఎంటెట్టుకెళ్లనేలేదు. ఏడాదికోసారి తనే వచ్చి ఎళ్తుండేవాడు. ఓసారి అలా వచ్చే ప్రయాణంలో ఢిల్లీ దగ్గర ఓ స్టేషన్లో టీ మగ్గు ఓ చేత్తో పట్టుకుని కదుల్తున్న బండెక్కబోయి స్లిప్పై జారిపోయేడు. ఆ చిన్న అజాగ్రత్త తన కాలునీ ఉద్యోగాన్నీ మింగేసి తనని తిరిగి ఈ గుడిసెల మధ్యకి విసిరేసింది.

ఆ బెంగే తర్వాత తన అయ్యనీ అమ్మనీ మింగేసింది. తప్పు తనదే కావడంతో కాంపన్సేషను ఏమీ రాలేదు. కాకపోతే పూనా ఆర్మీ హాస్పటల్లో ఉచితంగా వైద్యం చేసి జైపూరు కాలుపెట్టి పంపించేరు. ఎక్స్ ఆర్మీమేన్ గా ఏ ఉద్యోగమూ చెయ్యలేదు కాబట్టి ఊరికి దూరంగా పోతురాజు కొండకవతల అయిదెకరాల పోరంబోకు బూమికి పట్టా ఇచ్చేరు. ఇచ్చిన కొత్తల్లో ఆ బూమిని సాగు చేసి పంట పండించేసినట్టు కలలు కనేవాడు. ఒకసారి పడరాని పాట్లు పడి కొండ దరిదాపులకెళ్లి బూమిని చూసొచ్చేక ఆ ఆశ చచ్చిపోయింది. దాన్ని చదును చేసి వాడుకలో పెట్టడం జన్మలో తన వల్ల కాదని తేలిపోయింది.

కులపుటానవాయితీ ప్రకారం పిల్లకి పన్నెండేళ్ళకే మనువు చెయ్యవలసి రావడంతో ఆ పట్టా పంతులు గారి చేతుల్లోకి ఎళ్లిపోయింది. అప్పట్లో దాన్ని

కొనటానికి ఎవరూ ముందుకు రానప్పుడు పదిహేను వేలిచ్చి ఆదుకున్న పంతులు గారు దేవుడల్లే కన్పించి పదేపదే దణ్ణాలు పెట్టేడు.

తను తీరి తిన్నగా ఉండక గుడిసె పైన తాటాకు కప్పు తీసి పెంకునేయించేడు. నెలనెలా వచ్చే పెన్షను కాస్తా ఆ అప్పు కింద పోతా ఉంది.

జీవాల ధర బాగా పెరిగిపోయి ఒక్కో జీవం రెండువేల పైమాట పలుకుతా ఉంది. ఎంత చెయ్యి కొట్టుకున్నా లాభం గూబల్లోకొస్తంది. దాంతో మాంసం రేటు కేజీ నూటిరవైకి పెంచవలిసొచ్చింది. బీదాబిక్కీ చవగ్గా వొచ్చే సముద్రపు చేపల మీద పడతన్నారు. కలిగినోళ్లు కొంటారంటే ఆళ్ళకీ వారాలు వర్జాలు బాబాల పూజలు ఎక్కువైపోయి వారానికొక్కసారి కొనటం గగనమైపోతంది. అమ్మీవోళ్లెక్కువ తినీవోళ్లు తక్కువలాగుంది పరిస్థితి. అందుకే కాలుచెయ్యి బాగా ఉన్న గూడెంలోని మొగోళ్ళంతా ఏదో ఒక బైటపనికి పోతన్నారు. చాలా మందికి కూడు పెట్టిన పెంకుల మిల్లులు ఆగి పోవడంతో బతుకులు వీదిన పడి కకావికలై దూరంగా ఎక్కడెక్కడికో వలసలు పోతన్నారు. ఈ ప్రాంతంలో మేదరోళ్లు అంత తొందరగా కదిలే రకాలు కాక బుట్టలల్లి తట్టలల్లి ఒకపూట తినీతినకా బతుకు బళ్ళను లాక్కొస్తన్నారు.

"అమ్మా, చాలా ఆకలేస్తంది, తొందరగా అన్నం పెట్టు" అంటూ వచ్చేడు మనోజు.

సీరియల్ చూసేసి ఎప్పుడొచ్చి కూర్చుందో "రా రా అయ్యా, మీ నానకి ఇయాళ ఏటైందో తిండి కూడా మరిసి పోయి కళ్ళ మీద మోసెయ్యేసుకుని తెగ ఆలోసన సేసేస్తన్నాడు" అంది మంగ.

"రానాన్నా అన్నం తిందారి" అని భుజం పట్టుకుని కుదిపేడు మనోజు.

తనతో ఆర్మీలో పన్జేసిన తన నార్తిండియను ప్రియమిత్రుడి పేరు కొడుక్కి పెట్టుకున్నాడు ఈరాజు.

బళ్ళో వేసిన కొత్తలో తన పేరు చూసి అందరూ ఎక్కిరిస్తన్నారని పేచీ పెట్టీవోడు కుర్రోడు. కొంచెం ఎదిగేక "నాన్నా, మంచి పేరు పెట్టుకోవటానికి కులం

అడ్డొస్తాదా" అని అడిగేడు.

పన్నెండేళ్ళొచ్చినప్పట్నుంచి స్కూలు పుస్తకాలు చదివేసి ఊరుకోకుండా, పేపరు చూడ్డం, కథల పుస్తకాలు చదవడం నేర్చుకున్నాడు.

పదిహేనేళ్ళొచ్చేసరికి వాడడిగే ప్రశ్నలకీ వాడి ఆలోచనా విధానానికీ ఈఁరాజుకి భయం వేసేది. ఆ తర్వాత మనోజు ప్రశ్నలడగడం మానేసేడు. ఏ విషయమూ బైటికి చెప్పడు. ఏదో గుంభనంగా ఉంటాడు.

పదో తరగతి పేసయ్యాక అప్పటికి ఊరికి కొత్తగా కట్టిన నీళ్ళటేంకుల్దగ్గర నీళ్ళొదిలే పనిలో పెడితే నెలకి అయిదొందల జీతం, పైన కస్పీ దొరుకుతాయని చెప్పేడు ఈఁరాజు దగ్గిర ఎప్పుడూ మాంసం కొనే ఊరి సర్పంచి.

ఆ మాట చెప్తే అక్కణ్ణుంచి సైలెంటుగా లేచెళ్ళిపోయేడు మనోజు. ఇంకా పైకి చదవాలని ఉన్నట్టుంది, ఇంటర్ చదవటానికి పక్కూరి కాలేజీలో సీటు సంపాదించుకొచ్చేడు. కాలేజి అయిపోయేక అక్కడే పిల్లలెవరికో ప్రైవేట్లు చెప్తాడట. తండ్రిని డబ్బులేమీ అడగడు. చదువు మీద వాడి శ్రద్ధ చూస్తే ముచ్చట ఈఁరాజుకి. పెద్ద పెద్ద చదువులు చదివించి వాడు పెద్ద ఆఫీసరైతే చూడాలని కలలుకంటుంటాడు.

కాని, ఈ మధ్య మాంసానికొచ్చేవాళ్లు, మాంసం కొట్టే లోపల మాట్లాడుకొనే మాటలు వింటుంటే ఈఁరాజుకి భయం వేస్తా ఉంది. ఎంతెంత చదువులు చదివినా గవర్నమెంటు ఉద్యోగాలకి ఆశ పడ్డం ఇక పైన వేస్టట.

'ఖజానాలో డబ్బుల్లేక ఉన్నవాళ్లనే పీకేస్తుంటే ఇంక కొత్తవాళ్లకెవడిస్తాడు ఉజ్జోగం' అన్నాడు మొన్నొకసారి పెద్ద కాపుగారి సూర్యం.

మనోజు వద్దనుకున్న నీళ్లటేంకు ఉద్యోగం చాకలి గంగన్న కొడుకు రావుడు చేస్తున్నాడు. వాడికి డబ్బులు అవసరమైనప్పుడల్లా ఇళ్లల్లోకి నీళ్లు రాకుండా చేసేసి జనం నించి డబ్బులు బాగా గుంజుతున్నాడని ఊరంతా చెప్పుకుంటున్నారు. సంపాదన బాగానే ఉన్నట్టుంది, రావుడీ మధ్య వాచీ, ఉంగరాలు పెట్టుకుని సిగరెట్లు ఊదుకుంటూ కొత్త సైకిలు మీద తిరుగుతూ కనపడుతున్నాడు.

"ఏమైంది నాన్నా" అనడిగేడు మనోజు అన్యమనస్కంగా అన్నం కలుపుతున్న తండ్రిని.

"ఏట్లేదు లేరా" అన్నాడు ఈర్రాజు.

"ఏట్లేకపోటవేటి, మనిసి మనిసే తేడాగా ఉంటేని" అంది మంగ.

"నువ్వు నోర్ముయ్" అని అన్నంలో చెయ్యి కడిగేసేడు ఈర్రాజు.

తండ్రెప్పుడూ తల్లిని అలా కసురుకోవడం వినని మనోజు ఆశ్చర్యపడ్డాడు.

* * *

మర్నాడు తెల్లవారుతూనే రిక్షా ఏసోబు వచ్చి పంతులుగారు ఈర్రాజు కోసం రిక్షా పంపేరని చెప్పేడు.

"ఆరు ఈ మనిసి కోసం రిక్షా అంపటవేటీ, అయినా ఇంత పొద్దున్నే వచ్చేవెందుకన్నయ్యా, ఆ మనిసి ఆరు బయలు కెల్లేడు" అంది మంగ.

"ఆలీసవైతే మల్లీ మాంసం కొట్టుకెల్లిపోతాడు కదా బావ" అన్నాడు ఏసోబు.

"ఏటో పని?" అని ప్రశ్నార్థకంగా చూసింది రాత్రి అన్నం వండిన మసిగిన్నెని మట్టేసి బరాబరా తోముతూ.

"ఏటో మరి నాకూ తెల్దు. తిన్నంగా రిజిస్ట్రాపీసుకాడకి తీసుకొచ్చేమన్నారు"

వెంటనే మంగ, "మనోజూ, ఇదేటో సూడు, మీనానని అదేదో ఆపీసుకాడకి రమ్మన్నారంట" అని గట్టిగా కేకేసింది. ఆమె గొంతులో విన్పించిన భయానికి చటుక్కున ఇంట్లోంచి బైట కొచ్చేడు మనోజు.

"ఇయాల కాలేజీకి ఎల్లకురా అయ్యా, మీనానెంట ఎల్దువుగాని" అంది.

తండ్రొచ్చేవేళకి స్నానం చేసి తయారై కూర్చున్నాడు మనోజు.

"నాన్నా, ఆ పనేంటో నేన్జేసుకొస్తాను, నువ్వు మామూలుగా మాంసం కొట్టుకెల్లిపో" అన్నాడు.

"అది నీ వల్లయ్యే పని కాదులే, నువ్వెల్లు" అన్నాడు ఈ(్రాజు.

"ఆ... మరిసిపోయేను బావోయ్, నీకొడుకుని కూడా ఎంటెట్టుకు రమ్మన్నారు పంతులుగారు" అన్నాడు ఏసోబు.

పొయ్యి మీద టీకి నీళ్లు పడేసింది మంగ.

"అదేటి సెల్లమ్మా, గేసు పొయ్యి కొనుక్కోలేదా" అన్నాడు ఏసోబు.

"అదీ అయ్యిందన్నయ్యా, వంద కడితే సాలన్నారని పోలోమని కట్టేసేం. తీరా వచ్చేక పదేనొందలెట్టి ఇడిపించుకోవాలన్నారు. ఇన్నొందలేసి పొయ్యి కొనుక్కోటవేట్రా దేవుడా అని సేలా మంది ఎనక్కి తగ్గిపోయేరు. అప్పో సప్పో చేసి తెగించి కొనేసినోళ్లు ఎంటనే గేస్తంబం రేటు పెరిగిపోటం చూసి అల్లిపోయి అటకెక్కించేసేరు"

"అంతేలే, పొయ్యి మీదకే లేనోళ్లకి పొయ్యి కిందకి అంతంత డబ్బొయ్యడం మాటలా? ఒగ్గంటసేపు పోతురాజు కొండకేసి పోతే మోపుడు పుల్లలు తెచ్చుకోవచ్చు. మాపేటలో మల్లిగాడి కూతురికి గేసెలిగించడం రాక ఇల్లంటుకుపోయింది. ఆ వరసెట్టి ఇరవై కొంపలు మింగేసింది అగ్గి దేవత. అమ్ముదారంటే కొనీనాదుడు లేక ఇళ్లల్లో ఎట్టి పూజ్జేత్తన్నారు మా వోళ్లు గేసు పొయ్యిల్ని."

మౌనంగా మొహం కడుక్కుని, చొక్కా వేసుకుని తయారయ్యేడు ఈ(్రాజు.

ఈ(్రాజుకి, మనోజుకి, ఏసోబుకి గ్లాసుల్లో టీ పోసి ఇస్తూ "అన్నయ్యా, మీబావెక్కలేదు, కుంచెం రిచ్చానిలాగ గుమ్మం ముందుకట్టుకొద్దూ" అంది మంగ.

వాకిళ్ల ముందు పొడుక్కీ తవ్వి వదిలేసిన రెండు జానల వెడల్పు, మూడు జానల లోతు ఉన్న కాలవల్ని చూపిస్తూ "ఎలాగమ్మా అట్టుకురాటం? ఈళ్ళమ్మాసిగదరగ, ఈదులన్నీ ఇలాగ తవ్వి పోసేసేరు. ఎందుకురా అంటే పనికి ఆహారం పదకమో ఏదోనంట. పళ్లూడగొట్టి సేతిలో ఎట్టినట్టు ఉన్న పన్లన్నీ ఊడగొట్టి నాలుగురోజులు ఇలాటి పన్లు చూపించి అడావిడి చేసి నాలుగుశేర్లు బియ్యం పోసి పంపిస్తన్నారు అన్నం వొండుకుని గెంజేసుకు తినమని. పిచ్చి కుదిరేక రోకలి తలకి

సుట్టమన్నట్టుందొరే బావా" అన్నాడు ఏసోబు.

"నువ్వు కనిపెట్టేవో లేదో కాని మావా, ఆ పన్లన్నా ఎవరికిస్తన్నారనుకున్నావ్, నువ్వూనేనూ వెళ్తే ఇవ్వరు. పంచాయితీ మెంబర్లకి, మున్సిపాల్టీ కౌన్సిలర్లకి కావలసినోళ్లు అయ్యుండాలి. ఆరు బస్తాలు పంపకానికి, అరవై బస్తాలు అమ్మకానికీ" అన్నాడు మనోజు. ఎంతదాచుకున్నా దాగని రౌద్రం తొంగిచూసింది అతని గొంతులో.

'ఈడింత పెద్దోడెప్పుడయ్యేడు' అని బిత్తరపోయి చూసేడు ఈర్రాజు.

"గట్టిగా అనకురాబాబూ గొడవలైపోతై. రాజ్యం ఆళ్ళసేతుల్లో ఆడతంది మరి. మాపేటలో ఏవైందో తెల్సా, ఆ మద్దిన అందరం కూడెట్టీపనీపాటూ మానేసి శ్రమదానం చేసుకుని మట్టిరోడ్డేసుకున్నాం. ఈ బియ్యం పదకం పేరుతో ఆ రోడ్డంతా తవ్వి పోసేసేరు. పోనీ ఆ కాలవలకేమైనా సిమెంటు రాయించి డ్రైనేజీలాగ చేస్తారా అంటే అదేవీలేదంట. బియ్యం అయిపోయీదాకా తవ్వేసి వొదిలెయ్యడమేనంట. ఉప్పుడేవైంది, మా యాడోళ్ళు వాకళ్ళు తుడిసిన సెత్తంతా ఆ గోతుల్లోకి తోసేసీతలికి వారం రోజుల్లో అయ్యి నిండిపోయి తవ్విన కాలవలు మూసుకుపోయేయి." అని పగలబడి నవ్వేడు ఏసోబు.

"అడగటం మరిసిపోయేను అన్నయ్యా, ఈ మద్దిన మీ పేటలో బంతిబోయనాలు చేసేరంట మంత్రిగారొచ్చి"

"అవునమ్మా, ఒటేలు నుంచట్టుకొచ్చిన అన్నాన్ని మా బంతిలో కూసుని తిన్నాడు మంత్రిగారు. ఏటో, ఆళ్లెర్రిగాని అలాటి బోయనాల్తో కులాలు మాసిపోతాయా, గోత్రాలు మారిపోతాయా? నిజంగా అలాటిరోజు రావాలని ఆరికుంటే నాపిల్లని ఆళ్ళ కొడుక్కి చేసుకోవాలి. ఆళ్ళపిల్లని నీకొడుక్కియ్యాలి. అదీ మొగోడుతనవంటే; ఆ దమ్ములున్నాయేమో రమ్మను సూద్దారి."

ఈర్రాజు కోసం రిక్షా ఎందుకొచ్చిందోనని గూడెం అంతా ఈర్రాజు ఇంటి ముందు గుమిగూడేరు. వాళ్లని చూసి మంగ ఏడుపు లంకించుకుంది. ముసలీ ముతకా అంతా కలిసి పట్టుపట్టి ఈర్రాజు చేత అసలు విషయం చెప్పించేరు.

"ఓరిబాబో, లచ్చలొచ్చీ బూవిని పదేనేలకి సంతకం పెట్టి అప్పగించేత్తావా, ఓరెర్రి బాగులోడా, మనవన్నా లచ్చాదికార్లవేంట్రా లచ్చిందేవిని కాళ్లదన్నుకోటానికి?" అన్నాడు గూడెం పెద్ద గంది నర్సయ్య.

"ఈర్రాజూ నువ్వియేళ బైటికెళ్లకూరే. ఏసోబూ, నువ్వెల్లి ఈడింటికాడ లేడని సెప్పు." అన్నాడు.

"అదికాదు పెద్దయ్యా, పంతులుగారు సేలా మంచోడు" అన్నాడు ఈర్రాజు.

"మంచోడే, కాదని ఎవరన్నారు? నువ్వేవన్నా ఆరికి ద్రోహం సెయ్యబోతన్నావా, ఆరికొచ్చీ దాంట్లోంచే నీక్కుంత ఇత్తాడు. అసలు బూవి నీదే గదా"

"ఇదంతా ఇన్నాక నాకూ అదే మంచిదన్పిస్తంది బావా. పంతులే కాళ్ళబేరానికొచ్చి లచ్చో రెండు లచ్చలో ఇచ్చీదాకా సంతకం పెట్టకు" అన్నాడు ఏసోబు రిక్షా వెనక్కి మళ్ళిస్తూ.

"అది కాదురా ఏసోబూ, ఆపదంటే ఆదుకున్న పరమాత్ముడులాంటి పంతులుగార్ని మోసం చేత్తే పుట్టగతులుంటాయా అని బయవేత్తందొరే" అన్నాడు ఈర్రాజు.

"అదిగదీ సంగతి! పంతులుగారు సెప్పీ ఏదాంతవంతా బాగానే వొంటబట్టిందొరే నీకు. అసలు పరమాత్ముడనీవోడుంటే మనం ఇలాగెందుకుంటాంరా? ఇలాంటి ఎదవజన్మలెత్తడానికైతే పుట్టగతుల్లేకపోడవే మంచిది" అన్నాడు నర్సయ్య బోసి పళ్ళికిలించి.

"అదీ సంగతి ఈర్రాజూ! మనోజూ, నువ్వు మామ్మూలుగా కాలేజీకెల్లిపో. నేనెల్లొత్తాను బావా, జేగర్త మరి" అని ఏసోబు రిక్షా లాక్కొని వెళ్ళిపోయేడు.

నాలుగురోజులు కబుర్లు పంపినా ఈర్రాజు వెళ్ళకపోయేసరికి పంతులుగారు ఊరి సర్పంచిని కలిసి తన కష్టసుఖాలన్నీ చెప్పుకున్నాడు. ఎనమండుగురు పిల్లల్తో సంసారాన్ని ఈదడమే కష్టమైపోయిందని, పెద్దలిచ్చిన పాతలోగిలి తప్ప ఆస్తిపాస్తులేం మిగల్లేదని, టీచరుగా రిటైరైపోయేక పెన్షను డబ్బుల్తో ఎలాగో గడుపుకొని వస్తున్నాను,

ఇంకా ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు, ఓ కొడుకు చదువు, మరో కూతురి అత్తవారికి కట్నం డబ్బు బాకీ మిగిలి ఉన్నాయని, ఎకరం లక్ష చొప్పున బేరం కుదిరి యాభైవేలు ఎడ్వాన్సు తీసుకుని అమ్మాయి పెళ్ళిపనులు మొదలు పెట్టేనని, ఇప్పుడు ఈర్రాజు సంతకం పెట్టకపోతే ఒక కూతురి పెళ్ళి ఆగిపోతుందని, మరో కూతురు కాపురం చెడిపోతుందని చెప్పి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. సర్పంచి వెంటనే ఏం భయపడవద్దని అభయమిచ్చి పంతుల్ని ఆ ప్రాంతం ప్రజాప్రతినిధి దగ్గరికి తీసుకెళ్ళేడు. ప్రజాప్రతినిధి విషయం అంతా చాలా శ్రద్ధగా విన్నాడు.

భూమి కొనడానికి సిద్ధపడిన పార్టీని పిలిపించి విచారించేడు.

అక్కడి సాయిల్ టెస్టుల రిపోర్టులన్నీ పరిశీలించేడు. పోతురాజు కొండవెనక పోరంబోకు భూమి ఎవరెవరి పేర్లమీద ఉందో తెలుసుకున్నాడు.

"పంతులుగారూ, మంది పన్జేసే ప్రెబుత్వం. మీరేం బయపడకుండా ఎల్లండి. మొత్తం నేను జూసుకుంటాను" అని అభయమిచ్చేడు.

* * *

మర్నాడు ఆవూరి ఎస్సై ఇద్దరు కానిస్టేబుళ్ళతో జీపులో వచ్చి చెక్కకాలైనా పెట్టుకోనీకుండా ఈర్రాజుని జీపెక్కించి తీసుకెళ్ళేడు. అప్పటికే మనోజు కాలేజీకి వెళ్ళిపోయేడు. పోలీసు జీపుని చూసి ఈర్రాజుకి తోడుగా వెళ్ళడానికి గూడెంలో ఎవరూ ముందుకి రాలేదు.

వాకిట్లో గంగరావి చెట్టు కింద నెత్తిన చేతులేసుకుని శోకాలెడుతూ కూర్చుంది మంగ.

స్టేషన్లో ప్రజాప్రతినిధి, సర్పంచి, పంతులు కూర్చుని ఉన్నారు. ఎస్సై జీపు దిగివచ్చి సీట్లో కూర్చోకుండా ప్రతినిధికి వంగి నమస్కారం చేసి అది చాలక సెల్యూట్ చేసేడు. కూర్చోమని ప్రతినిధి చేత్తో సైగ చేసే వరకు నిలబడే ఉన్నాడు.

కానిస్టేబుళ్ళు ఈర్రాజుని చెరోరెక్క పట్టుకుని తీసుకొచ్చి గోడకి ఆనించి నిలబెట్టేరు.

అనుకోని ఈ హఠాత్పరిణామానికి ఈశ్వరాజు చలనం ఉడిగి పోయినట్టైపోయేడు. గొంతులో తడి ఆరిపోయింది.

సిల్కులాల్చీ షరాయిలో కుర్చీ పట్టకుండా కూర్చున్న ఆ వ్యక్తిని ఎన్నికల్లో గెల్చినప్పుడు పూలదండల్తో ట్రాక్టరుమీద ఊరంతా ఊరేగిన ప్రజాప్రతినిధిగా గుర్తుపట్టేడు. సెంటర్లో చాలా షాపుల్లో ఈయనగారి ఫొటోలు తగిలించి ఉండడం చూసేడు. అలా ఫోటోలు పెట్టుకోని వాళ్ళ మీద ఆయనకి కోపం వస్తుందని భోజనం హొటలు సత్తిరాజు చెప్పేడు.

ఈశ్వరాజు ఏదో చెప్పబోయి భయంతో ఆగిపోయేడు.

ప్రతినిధి ఓ సారి పైనించి కింది వరకూ ఈశ్వరాజుని పరిశీలించి చూసేడు. హఠాత్తుగా మొహంలో నవ్వు మొలిపించుకుని-

"తమ్ముడూ, సంగతంతా నాకు తెల్సింది, నువ్వు గాని, పంతులుగాని ఏవీ చెప్ప వలిసిన పనిలేదు. ఇద్దరూ న్యాయంగా నడుసుకోలేదు. ఆర్మీలో నీ సేవకి మెచ్చి ప్రెబుత్వం ఇచ్చిన బూవిని అమ్మటం నీ తప్పు. నీపూర్తి చేరాలు, హామీ పత్రం లేకుండా దాన్ని కొనటం పంతులు తప్పు. ఉప్పుడీ యెవహారం చేలా గొడవల్లో పడింది. ప్రస్తుతానికి ప్రెజాప్రతినిదిగా నేను మీకు చెయ్యబోయీా సాయం ఏటంటే మీరిద్దరూ ఈ బూమి గొడవనించి బైట పడీలాగ సెయ్యటం. మీకిద్దరికీ ఇష్టవేనా?" అన్నాడు.

ఇద్దరూ వెంటనే తలలూగించేరు. అసలిదంతా గొడవెందుకైందో, దాన్ని ఈయన తీర్చడం ఏంటో పెద్దగా చదువుకోని ఈశ్వరాజుకే కాదు, చదువుకున్న పంతులుకీ అర్థం కాలేదు.

"నాకస్సలు టైం లేదు. మనోడు సర్పంచి చెప్పేడని ఇలాగ రావలసి వచ్చిందయ్యా ఎస్సయ్యా! రాత్రికి గౌతమీలో అయిద్రాబాదు ప్రెయాణం. ఎలకస్న్లో గెల్డం కాదుగానీ సీటికీ మాటికీ అయిద్రాబాదు ఎల్లలేక సచ్చిపోతన్నాననుకో. పస్టుక్లాసు ఏసీలో ప్రెయాణం హాయిగానే ఉంటాదనుకో, ఇక్కడ మనయాపారాలూ, యవసాయం ఎవడు జూత్తాడు చెప్పు" అన్నాడు ప్రతినిధి.

"అవునవునండి" అన్నాడు ఎస్సై వినయంగా తల ఊగిస్తూ.

"నాకు టైం లేదు గానీ నువ్వుప్పుడేం జేత్తావంటే రెండు తెల్ల కాయితాల మీద ఈళ్ళిద్దరి సంతకాలు తీస్కో. అన్నట్టు సంతకం వొచ్చా ఒరే ఈర్రాజూ" అని నవ్వేడు. "వొచ్చే ఉంటాదిలే, ఆర్మీలో చేసొచ్చేవు కదా! మరి నేను అట్నుంచొచ్చేక ఈ యవ్వారం సెటిల్‌జేత్తాను" అంటూ లేచెళ్ళిపోయేడు ప్రతినిధి.

ఆయన వెనక చేతులు కట్టుకుని సర్పంచి నడిచేడు.

ఎస్సై ఇచ్చిన తెల్లకాయితాల మీద సంశయించకుండా ఈర్రాజు, సంశయిస్తూ పంతులు సంతకాలు చేసి బైటికొచ్చేరు. కొందరు ఈర్రాజు తరఫున కొందరు పంతులు తరఫున ఊళ్ళో అందరూ ఈ విషయమై తలో మాటా చెప్పుకున్నారు. పదిరోజులు దాటకుండా క్వారీ తవ్వకాలు మొదలయ్యేయని తెలిసి పంతులు ప్రతినిధి ఇంటి ముందు వాలిపోయేడు. అయ్‌గారింకా అయిద్రాబాదు నించి రాలేదని కబురు. చేసేదేం లేక అవతలి పార్టీ ఇంటికి పరుగెట్టేడు. అతను పంతులుకి ఎడ్వాన్సుగా ఇచ్చిన యాభైవేలూ ప్రతినిధి అతనికి తిరిగి ఇవ్వడానికి ఒప్పుకుని ఈ క్వారీతో అతనికేం సంబంధం లేదని రాయించి పుచ్చుకున్నాడట.

పంతులు లబోదిబోమని గోలపెడుతూ మళ్ళీ ప్రతినిధి ఇంటికి పరుగెత్తబోతూంటే "ఎందుకొచ్చింది గానీ పంతులూ, నా మాట విను, రాజకీయ నాయకుల జోలికి వెళ్ళబోకు. దంచినమ్మకి బొక్కిందే దక్కుడు, యాభైవేలూ లాక్కోనందుకు సంతోషించు. నాయాభైవేలకీ నీళ్ళొదులుకున్నాన్లే" అని తలుపేసుకున్నాడు.

పిట్టపోరూ పిట్టపోరూ పిల్లి తీర్చిందని ఊళ్ళో అందరూ పైకి వినపడకుండా చెప్పుకున్నారు.

*********

**అమెరికాభారతి (మార్చి -ఏప్రిల్ 2002)**

**(ATA - బహుమతి)**